క్లుప్తంగా

అర్హులను గుర్తించాలి...

పాల్వంచరూరల్: గృహజ్యోతి, గృహలక్ష్మి, ఉచిత విద్యుత్, గ్యాస్ సిలెండర్ల పథకాల మంజూరులో సాంకేతిక లోపం కారణంగా కొంత మందిని అనర్హులుగా గుర్తించారని అట్టివారిని తిరిగి దరఖాస్తు చేసుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. గురువారం ఆయన మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా దరఖాస్తులను పరిశీలించారు. ఎంపీడీఓ కె.విజయభాస్కర్‌రెడ్డితో మాట్లాడారు.

పోరాట దినంగా పాటించాలి

టేకులపల్లి: మార్చి 8 అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవాన్ని పోరాటదినంగా పాటించాలని, రాజ్యాంగ, మహిళల హక్కులను కాలరాస్తున్న బీజేపీ, దాని మిత్రపక్షాలకు వ్యతిరేకంగా పోరాడాలని ప్రగతి శీల మహిళ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షురాలు నోముల కళావతి పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం మండల కేంద్రంలో జాతీయ కమిటీ పిలుపులో భాగంగా ఈనెల 1–15 వరకు దేశవ్యాపితంగా ర్యాలీలు, సభలు, సదస్సుల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. అంతర్జాతీయ మహిళా దినం అంటే సంబరాలు, ఉత్సవాలు జరుపుకోవడం కాదని, ముగ్గుల పోటీలు అంత కంటే కాదని, మార్చి 8 అంటే మహిళల ధిక్కార పతాకం అన్నారు.

మహిళా సదస్సును విజయవంతం చేయండి

ఇల్లెందురూరల్: అంతర్జాతీయ మహిళా దినోత్సవ స్ఫూర్తితో మోదీ ప్రభుత్వం విధానాలకు వ్యతిరేకంగా మహిళాలోకం ఉద్యమించాలని పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు యదళ్లపల్లి సావిత్రి పిలుపునిచ్చారు. మార్చి 12న కొత్తగూడెంలో నిర్వహించే మహిళా సదస్సును విజయవంతం చేయాలని కోరుతూ మండలంలోని ఎల్లాపురం గ్రామంలో గురువారం ప్రచార యాత్ర నిర్వహించారు. మాట్లాడుతూ.. మోదీ ప్రజల్లో ఉన్న విశ్వాసాలను, వెనుకబాటుతనాన్ని ఆసరాగా చేసుకొని మతవిద్వేశాలను రెచ్చగొడుతున్నారని విమర్శించారు.

సర్వసభ్య సమావేశం వాయిదా

టేకులపల్లి: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు ఏర్పాటు చేశారు. ముందస్తుగానే ఎంపీటీసీలు, మండల అధికారులకు సమాచారం అందించారు. అయినా మొత్తం 14 మంది ఎంపీటీసీలలో ఎంపీపీ భూక్యా రాధ, ఎంపీటీసీ బానోతు సరోజిని, కోఆప్షన్ సభ్యుడు మౌలానా, పది లోపు అధికారులు హాజరయ్యారు. 12 గంటల వరకు కూడా కోరంకు సరిపడా ఎంపీటీసీలు రాలేదు. దీంతో సూపరింటెండెంట్ సామల శ్రీనివాస్ సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

తునికాకు టెండర్లు పిలవండి..

టేకులపల్లి: తునికాకు సేకరణ టెండర్లు వెంటనే పిలిచి, ప్రూనింగ్ పనులు చేపట్టాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కుంజ రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం టేకులపల్లి ఫారెస్టు కార్యాలయం ఎదుట తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, తెలంగాణ రైతు సంఘం, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ... ప్రభుత్వం 194 తునికాకు యూనిట్లకు టెండర్లు పిలవాల్సి ఉండగా కేవలం 26 యూనిట్లకే టెండర్లు ఖరారు చేసిందన్నారు. సకాలంలో టెండర్లు పిలిచి, ప్రూనింగ్ పనులు ప్రారంభిస్తేనే ఆకు నాణ్యంగా ఉంటుందన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

గురువారం వివిధ కార్యాలయాలు, విద్యాసంస్థలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. మహిళా ఉద్యోగులను సన్మానించారు. పలువురు మాట్లాడుతూ.. మహిళలు ఎక్కడ గౌరవించబడతారో అక్కడ సుఖశాంతులు వర్ధిల్లుతాయన్నారు. మారుతున్న కాలంతోపాటు సమాజంలో గుర్తింపును పొందేలా మహిళలు అన్నిరంగాల్లో పోటీ పడాలని ఆకాంక్షించారు. – సాక్షి నెట్‌వర్క్

రేపటికి ముందడుగు


కొత్తగూడెంఅర్బన్: రామవరం పాఠశాలలో..


ఇల్లెందు: సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో..


ఇల్లెందురూరల్: మాట్లాడుతున్న కీర్తిచంద్రికారెడ్డి


పాల్వంచరూరల్: కేఎల్ఆర్ విద్యాసంస్థలో...


టేకులపల్లి: గంగారం ఆశ్రమ పాఠశాలలో...


చుంచుపల్లి: జెడ్పీ కార్యాలయంలో..


ఇల్లెందు: ర్యాలీని ప్రారంభిస్తున్న నిమ్మి ఆనంద్


కొత్తగూడెంరూరల్: వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో

గ్రామీణ రహదారులకు మహర్దశ

కొత్తగూడెంరూరల్: నియోజకవర్గంలోని గ్రామీణ రహదారులకు మహర్దశ రాబోతోందని, వివిధ పథకాలతో నియోజకవర్గ వ్యాప్తంగా రహదారుల నిర్మాణాలు వేగవంతంగా జరుగుతున్నాయని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. గురువారం రేగళ్ల, మైలారం, బంగారుచెలక, చంద్రలగూడెం తదితర గ్రామాల్లో రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేసి, పనులు ప్రారంభిచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూనంనేని మాట్లాడారు. ప్రజలకు మౌలిక వసతులు, పెండింగ్ సమస్యల పరిష్కారమే అజెండాగా ముందుకు సాగుతున్నామన్నారు.

పాల్వంచరూరల్: ఏజెన్సీ ప్రాంతంలోని గ్రామాలకు అన్ని సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. చంద్రాలగూడెం గ్రామం వద్ద గురువారం రూ.3కోట్ల వ్యయంతో నిర్మాణం చేయనున్న హైలెవల్ బ్రిడ్జి, బీటీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. నిర్మాణ పనులు నాణ్యంగా ఉండాలన్నారు.

కిసాన్ మేళా ప్రారంభం..

సూపర్‌బజార్(కొత్తగూడెం): వ్యవసారంగంలో వచ్చిన నూతన పద్ధతులను పాటిస్తే తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడులు సాధించేందుకు వీలుంటుందని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. కృషి విజ్ఞాన కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన కిసాన్ మేళా కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. మాట్లాడుతూ.. ప్రస్తుతం అధునాతనమైన వ్యవసాయ పరికరాలు అందుబాటులోకి వచ్చినట్లు చెప్పారు. వ్యవసాయ శాఖ, ఉద్యాన శాఖ అధికారులు ఎప్పటికప్పుడు రైతులకు తగిన సలహాలు, సూచనలు అందజేయాలన్నారు. శాస్త్రవేత్తలు క్షేత్రస్థాయిలో పర్యటించి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకునే అంశాలపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు రైతులను ఎమ్మెల్యే సన్మానించారు. కంపెనీలు, వ్యవసాయాధికారులు ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు.


పాల్వంచరూరల్: బ్రిడ్జి, రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కూనంనేని

అభివృద్ధి పనులకు శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్

జూలూరుపాడు: మండలంలోని పలు గ్రామాల్లో వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ గురువారం విస్తృతంగా పర్యటించి, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. జూలూరుపాడు ప్రభుత్వ కార్యాలయాల సముదాయం, పడమటనర్సాపురం, సాయిరాంతండా, పాపకొల్లు, అన్నారుపాడు, జూలూరుపాడులలో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ 1.73 కోట్లతో నిర్మించనున్న సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అదేవిధంగా మండల కేంద్రం జూలూరుపాడులో డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ ట్రస్ట్ (డీఎంఎఫ్‌టీ) నిధులు రూ 5.22 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారు. తల్లాడ–భద్రాచలం రాష్ట్రీయ రహదారిపై సెంట్రల్ లైటింగ్‌ను రాందాస్ నాయక్ ప్రారంభించారు. ఎంపీడీఓ కరుణాకర్‌రెడ్డి, తహసీల్దార్ స్వాతి బిందు, సీఐ ఇంద్రసేనా రెడ్డి, పీఆర్ ఏఈ నాగేంద్ర, లేళ్ల వెంకటరెడ్డి పాల్గొన్నారు.

పంట రుణాలు చెల్లించి రాయితీ పొందండి

చుంచుపల్లి: రైతులు పంట రుణాల వడ్డీని సకాలంలో చెల్లించి వడ్డీ రాయితీతో పాటు రుణమాఫీకి అర్హులు అవుతారని కొత్తగూడెం సొసైటీ చైర్మన్ మండె వీరహనుమంతరావు అన్నారు. గురువారం సొసైటీ కార్యాలయంలో మాట్లాడతూ.. రైతులు మార్చి లోపు వడ్డీ చెల్లిస్తే 7 శాతం మాత్రమే ఉంటుందని, తరువాత అయితే 14 శాతం చెల్లించాల్సి ఉంటుందన్నారు. సొసైటీ పరిధిలోని రైతులకు అవగహన కల్పించేలా చూడాలని సంఘ డైరెక్టర్లకు సూచించారు. అలాగే కొత్తగూడెం సొసైటీ ద్వారా తీసుకున్న గేదెలు, మోటార్ సైకిల్ రుణాలు వెంటనే చెల్లించాలని కోరారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల ధర్నా

సూపర్‌బజార్(కొత్తగూడెం): సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నేషనల్ హెల్త్ మిషన్‌లో పనిచేస్తున్న అన్ని కేడర్ల ఉద్యోగులు గురువారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌కు ప్రదర్శనగా వెళ్లి ధర్నా నిర్వహించారు. యూనియన్ రాష్ట్ర కార్యదర్శి నరాటి ప్రసాద్ మాట్లాడుతూ... నూతన ప్రభుత్వం వేతన జీవుల ఆకాంక్షలను నెరవేర్చాలని కోరారు. గ్రామస్థాయిలో నిరంతరం ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించడంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పనులను కూడా నిర్వహిస్తున్నామన్నారు. మూడు నెలలుగా వేతనాలు రాకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్ ఎదుట అకలికేకలు వేయాల్సి రావడం దురదృష్టకరమన్నారు. అనంతరం డీఎంహెచ్‌ఓ డాక్టర్ శిరీషకు వినతిపత్రం అందజేశారు. డాక్టర్లు అరుణకుమారి, ఉమాదేవి, అనూష, శిరీష, సౌమ్య, మానస, స్రవంతి, మనోజ్, వినయ్, శ్రీనివాసరెడ్డి, ఉద్యోగులు పాల్గొన్నారు.


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఉద్యోగులు

ప్రజాపాలన దరఖాస్తుల పరిశీలన

పాల్వంచరూరల్: పాల్వంచ మండల ప్రజాపరిషత్ కార్యాలయాన్ని డీఆర్డీఓ విద్యాచందన గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన హెల్ప్ డెస్క్ కంప్యూటర్‌లో వివరాల జాబితాను పరిశీలించారు. ఎంపీడీఓను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

'ఉపాధి'లో పారదర్శకత

ఉపాధి హామీ పనులు పారదర్శకంగా జరుగుతున్నాయంటే దానికి సామాజిక తనిఖీలే కారణం అని ఎంపీడీఓ కె.విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. ఎంపీడీఓ కా ర్యాలయంలో గురువారం 15వ విడత సామాజిక తనిఖీ కోఆర్డినేషన్ సమావేశం జరిగింది. ఎంపీడీఓ మాట్లాడుతూ ఉపాధి హామి పనులు పాదర్శకంగా నిర్వహించడం వలన నేడు కూలీలకు పూర్తిస్థాయిలో న్యాయం జరుగుతోందన్నారు.

ఓటు హక్కు నమోదు చేసుకోండి

పటిష్టమైన పార్లమెంటరీ వ్యవస్థ నిర్మించబడాలంటే భారతదేశంలోని 18 సంవత్సరాలు నిండిన ప్రతీ పౌరుడు ఓటు హక్కు నమోదు చేసుకోవాలని జిల్లా పరిషత్ సీఈఓ ప్రసూనరాణి అన్నారు. స్థానిక కేటీపీఎస్ 5, 6 దశల కర్మాగారంలో గురువారం ఓటరు నమోదు, సద్వినియోగం అనే అంశంపై అవగాహన సదదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు.

చికిత్స పొందుతున్న యువకుడు మృతి

పాల్వంచరూరల్: స్థానిక వనమా కాలనీకి చెందిన ఇట్ట రామకృష్ణ (22)ను ప్రేమ విషయంలో తల్లి మందలించింది. దీంతో రామకృష్ణ మనస్థాపం చెంది ఈనెల 4వ తేదీన పురుగుమందు తాగాడు. గమనించిన కటుంబ సభ్యులు స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుని తల్లి జానకమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాము తెలిపారు.

క్రికెట్ ఆడుతూ గుండెపోటుతో ..

సింగరేణి(కొత్తగూడెం): క్రికెట్ ఆడుతూ గుండెపోటుతో ఓ యువకుడు కుప్పకూలి మృతిచెందిన ఘటన చుంచుపల్లి మండలం గౌతంపూర్‌లో చోటుచేసుకుంది. వివరాలిలా.. గౌతంపూర్ కాలనీకి చెందిన సింగరేణి కార్మికుడు పొన్నగంటి అంకూస్ కుమారుడు యశ్వంత్ (32) రుద్రంపూర్‌లోని జయశంకర్ స్టేడియంలో గురువారం సాయంత్రం స్నేహితులతో కలిసి క్రికెట్ ఆడుతుండగా ఒంట్లో కొంత నలతగా ఉందంటూ చెట్టుకింద కూర్చుని ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. గమనించిన స్నేహితులు పిట్స్ వచ్చిందనుకుని స్థానిక ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడని వైద్యులు తెలిపారు. మృతుడికి తల్లి, తండ్రి, భార్య ఉన్నారు. మృతుడి తమ్ముడు అస్ట్రేలియాలో ఉద్యోగం చేస్తుండగా, అతడు వచ్చిన తర్వాత అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబసభ్యులు తెలిపారు.


విద్యార్థులకు పరీక్ష సామగ్రి వితరణ

జూలూరుపాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 30 మంది పదో తరగతి విద్యార్థులకు జేపీఆర్ ఫౌండేషన్ నిర్వాహకుడు ఇదుపుల రాజు పరీక్ష సామగ్రి ప్యాడ్, జామెట్రీ బాక్స్‌లను అందజేశారు.

ముస్తాబైన శైవక్షేత్రాలు


టేకులపల్లి: బోడులోని కాశీ విశ్వేశ్వర ఆలయం


ఇల్లెందు: ముస్తాబైన శ్రీ హరిహర క్షేత్రం


కొత్తగూడెంటౌన్: శ్రీమాతాశక్తి దేవాలయం

ఇల్లెందురూరల్: పరమేశ్వరుడు అభిషేక ప్రియుడు. ఓ పండు సమర్పించినా.. ఓ చెంబు నీళ్లతో అభిషేకించినా అనుగ్రహిస్తారనే నమ్మకం. కాసిన్ని నీళ్లతో కొన్ని బిల్వపత్రాలతో కొంచెం భస్మంతో సంతోషపడి వరాలిచ్చే దేవుడు ఎవరైనా ఉన్నారా.. అంటే అది మహాదేవుడైన శంకరుడే. శుక్రవారం మహాశివరాత్రిని పురస్కరించుకొని జిల్లాలో శైవ క్షేత్రాల్లో అభిషేకాలు, దర్శనాలు, జాగారం కోసం ఉపవాసాలు చేసే భక్తుల కోసం ఆయా ఆలయాల్లో సర్వం సిద్ధం చేసుకుంటున్నారు. ఉపవాస దీక్షలు చేపట్టి స్వామి నామస్మరణతో గడుపుతారు.

ముస్తాబైన ఆలయాలు...

మహాశివారాత్రి పర్వదినం పురస్కరించుకొని మండలంలోని పలు గ్రామాలలో శివాలయాలను ఆలయ కమిటీ ప్రతినిధులు అందంగా ముస్తాబు చేశారు. మహాశివరాత్రి రోజున శివపూజకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాటు చేశారు. ఆలయాలను విద్యుదీపాలతో అలంకరించారు. ప్రత్యేకంగా రాత్రివేళ శివపార్వతుల కల్యాణం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ఇల్లెందు: మహాశివరాత్రి రోజు శివ, పార్వతుల కల్యాణం జరపటం ఈ పర్వదినం విశిష్టత. ఈ రోజు రాత్రి శివుడు తాండవం చేస్తాడని హిందువుల నమ్మకం. శీతాకాలం చివరలో వేసవికాలం ముందు వచ్చే మాఘమాసంలో ఈ పండుగ వస్తుందని మాఘమాసం కృష్ణ పక్షం చతుర్థశి రోజున శివుని జన్మనక్షత్రం ఆరుద్ర యుక్తుడైన రోజున లింగాకారంగా ఆవిర్భవించాడని పేర్కొంటున్నారు. మహాశివరాత్రి సందర్భంగా పట్టణంలోని పలు శివాలయాలు ఉత్సవాలకు ముస్తాబయ్యాయి. పట్టణంలోని శ్రీ హరిహర క్షేత్రంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త సూర్యప్రకాశరావు, అర్చకులు రాఘవశర్మ గురువారం ప్రకటించారు.

కొత్తగూడెంటౌన్: శుక్రవారం మహాశివరాత్రి సందర్భంగా శివాలయాలను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. కొత్తగూడెంలోని శివాలయాల్లో ఆయా ఆలయ నిర్వాహకులు, పాలకమండలి సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పరమశివుడికి జ్యోతిర్లింగార్చనలు, అభిషేకాలు జరగనున్నాయి.

టేకులపల్లి: మండలంలోని పలు ఆలయాలను కమిటీ ఆధ్వర్యంలో ముస్తాబు చేశారు. బోడులోని శ్రీ విజయ విఘ్నేశ్వర కాశీ విశ్వేశ్వర దేవాలయం, టేకులపల్లిలోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం, కొండెంగులబోడులోని వీరభద్ర కాళీమాత ఆలయం, సిద్దారంలోని సోమలింగేశ్వర స్వామి దేవాలయం తదితర ఆలయాల్లో శివరాత్రి వేడుకలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు.